TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-157 పేజీలు:-4 మంగళవారం 19-05-2026

SIMULTANEOUSLY PRINTED AT ADILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## నిజామాబాద్ జిల్లాకు రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారు



- మహేశ్ గౌడ్‌ను అణగదొక్కాలనేది రేవంత్ కుట్ర అన్న అర్వింద్
- అందుకే నిజామాబాద్ జిల్లాను పట్టించుకోవడం లేదని ఆరోపణ
- కోమటిరెడ్డిని సీఎం చేయాలన్న అర్వింద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి - మిగతా 2 లో

# రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక పథకం

ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత బీమా..

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి సామాన్య, పేద కుటుంబానికి గట్టి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అత్యంత ప్రతిష్టాత్మకమైన పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. సమాజంలో వెనుకబడిన, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలవడమే ధ్యేయంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' అనే సరికొత్త సామాజిక రక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏకంగా రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా ప్రయోజనాన్ని చేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను (+ూ) వీలైనంత త్వరగా జారీ చేసేందుకు పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖలు అవసరమైన




## బండి సంజయ్ లక్ష్యంగా బీఆర్ఎస్ పోస్టర్లు



- బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదన్న రామచందర్ రావు
- బండి సంజయ్, బీజేపీపై రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శ
- వ్యక్తిని, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం సరికాదన్న రామచందర్ రావు

కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదని, కానీ ఆయనపై బీఆర్ఎస్ - మిగతా 2 లో

# ఇరాన్-అమెరికా యుద్ధానికి తెర?..

- పాక్ ద్వారా కొత్త శాంతి ప్రతిపాదన!
- పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు అమెరికాకు ఇరాన్ కొత్త ప్రతిపాదన
- ఇరు దేశాల మధ్య మధ్యవర్తిగా పాకిస్థాన్ కీలక చర్చలు
- సమయం మించిపోతోందంటూ ఇరాన్‌ను హెచ్చరించిన ట్రంప్
- అమెరికా షరతులు కఠినంగా ఉన్నాయని ఇరాన్ అసంతృప్తి



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికాతో శాంతి చర్చల కోసం ఇరాన్ ఒక సవరించిన ప్రతిపాదనను పంపింది. ఇరు దేశాల మధ్య మధ్యవర్తిగా - మిగతా 2 లో

## రష్యా, ఇరాన్ నుంచి క్యూబా డ్రోన్లు సేకరిస్తున్నట్లు వెల్లడి

- అమెరికా నేవల్ బేస్‌పై 300 డ్రోన్లతో దాడికి క్యూబా కుట్ర?
- క్యూబా వద్ద 300కు పైగా సైనిక డ్రోన్లు ఉన్నాయని అమెరికా ఆందోళన
- అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు క్యూబా యోచిస్తోందని నిఘా వర్గాల రిపోర్ట్
- క్యూబాకు సీఐఏ డైరెక్టర్ వార్నింగ్, మాజీ నేతపై కేసు నమోదుకు సన్నాహాలు
- అమెరికా ఆరోపణలను ఖండించిన క్యూబా.. తమది ఆత్మరక్షణేనని స్పష్టీకరణ



క్యూబాను అమెరికా ఇప్పుడు ఓ భద్రతాపరమైన ముప్పుగా పరిగణిస్తోంది. సుమారు 300కు పైగా సైనిక డ్రోన్లను హవానా సమీకరించుకుందని, అమెరికా లక్ష్యాలపై దాడులకు సంబంధించిన ప్రణాళికలు చర్చిస్తోందని వర్గీకృత నిఘా వర్గాలు గుర్తించినట్లు 'యాక్సియోస్' కథనం - మిగతా 2 లో

# విజయ్ ప్రభుత్వం ఆరు నెలలకు మించి ఉండదు

- డీఎంకే ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు
- స్టాలిన్ త్వరలోనే సీఎం అవుతారని అనితా రాధాకృష్ణన్ ధీమా
- టీవీకే నేత ఆధవ్ అర్జునకు బహిరంగ సవాల్
- కొళత్తూర్ ఓటర్లపై వివాదాస్పద వ్యాఖ్యలు




తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే కూటమి ప్రభుత్వం ఆరు నెలలు కూడా అధికారంలో కొనసాగలేదని డీఎంకే సీనియర్ నేత, తిరుచెందూర్ ఎమ్మెల్యే అనితా

## మన దేశం గురించి తెలియకనే ఆ విమర్శలు

డచ్ ప్రధానికి భారత్ గట్టి కౌంటర్



- భారత్‌లో మైనారిటీల హక్కులపై డచ్ ప్రధాని ఆరోపణలు
- భారత సామాజిక వ్యవస్థ, చరిత్రను వివరిస్తూ విదేశాంగ శాఖ కౌంటర్
- అనేక మతాలు శతాబ్దాలుగా వర్ధిల్లుతున్నాయని స్పష్టం

భారత్‌లో పత్రికా స్వేచ్ఛ, మైనారిటీల హక్కులపై డచ్ ప్రధానమంత్రి రోబ్ జెట్టెన్ చేసిన వ్యాఖ్యలను విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. మన దేశ - మిగతా 2 లో

## నేడు కేరళ సీఎంగా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం



- పదేళ్ల తర్వాత కేరళలో అధికారంలోకి యూడీఎఫ్ కూటమి
- ప్రమాణ స్వీకారానికి హాజరుకానున్న రాహుల్, ప్రియాంక గాంధీ
- ముఖ్యమంత్రితో కలిపి 21 మందితో కేబినెట్ కూర్పు
- ప్రమాణ స్వీకారానికి ముందు కార్డినల్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్న సతీశన్

కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ సోమవారం ప్రమాణ స్వీకారం - మిగతా 2 లో

## నేను ఎమ్మెల్యే కావాలనే ఆశ నాకంటే మీకే ఎక్కువగా ఉన్నట్టుంది



- ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో తాను రూ. 600 కోట్ల అవినీతికి పాల్పడ్డానని ఆరోపించారన్న బైరెడ్డి
- ఒక్క ఆరోపణనైనా నిరూపించారా అని ప్రశ్న
- తనకు ఒక్క రూపాయి ఆస్తి కూడా లేదని వ్యాఖ్య

తనపై విమర్శలు చేసే వారికి మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా బహుమతులు ఇస్తున్నారంటూ వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు ఎన్నికల్లో టికెట్ రాలేదంటూ మంత్రి చేస్తున్న వ్యాఖ్యలపై - మిగతా 2 లో

# టీటీడీ ఘనత పట్ల సీఎం చంద్రబాబు స్పందన

- తిరుమలలో 89.40 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన టీటీడీ
- టీటీడీ అధికారులను, సిబ్బందిని అభినందించిన సీఎం చంద్రబాబు
- శేషాచలం కొండల్లో అటవీ సంపద పరిరక్షణపై ప్రశంసలు
- ప్రకృతిని కాపాడటం దైవ సేవతో సమానమని వ్యాఖ్య
- భావి తరాలకు పచ్చని తిరుమలను అందించాలని సూచన




తిరుమల కొండల్లో పచ్చదనాన్ని గణనీయంగా పెంచినందుకు తిరుమల తిరుపతి

## 'బాదుడే బాదుడు'కు బ్రాండ్ అంబాసిడర్ గొడ్డలి పార్టీ



- ఇంధన ధరల పెంపుపై వైసీపీ ఆందోళనలు రాజకీయ నాటకమని విమర్శలు
- తమ హయాంలో రూ.41 పెంచిన వైసీపీ ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యలు
- ప్రస్తుత ధరల పెరుగుదలకు అంతర్జాతీయ పరిస్థితులే కారణమని స్పష్టం
- ప్రజలపై భారం మోపిన జగన్ ఇంటి ముందు ధర్నా చేయాలని వైసీపీకి హితవు

'బాదుడే బాదుడు' కార్యక్రమానికి అసలైన బ్రాండ్ అంబాసిడర్ గొడ్డలి పార్టీ అయిన వైసీపీనేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
మంగళవారం 19-05-2026

## టీటీడీ ఘనత పట్ల సీఎం చంద్రబాబు స్పందన

మొదటిపేజీ తరువాయి – దేవస్థానం (టీటీడీ)పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. తిరుమల గిరుల వ్యాప్తంగా 89.40 శాతం అటవీ విస్తీర్ణాన్ని సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ టీటీడీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ.. శేషాచలం కొండల్లో అటవీ సంపదను కాపాడటం, స్థానిక జాతుల మొక్కలను పునరుద్ధరించడం కోసం టీటీడీ చేపట్టిన సుస్థిర పరిరక్షణ చర్యలు అభినందనీయమన్నారు. ఈ కృషి ఫలితంగానే పచ్చదనం గణనీయంగా పెరిగిందని కొనియాడారు. "మన సంప్రదాయాలు ప్రకృతిని పవిత్రంగా భావిస్తాయి. అడవులు, వన్యప్రాణులను రక్షించడం దైవ సేవతో సమానం. భావి తరాలకు మరింత పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమలను అందించడానికి ఈ ప్రయత్నాలు ఎంతగానో దోహదపడతాయి" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు. టీటీడీ కృషి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణకు టీటీడీ యాజమాన్యం చూపుతున్న చొరవను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

## బండి సంజయ్ లక్ష్యంగా బీఆర్ఎస్ పోస్టర్లు

మొదటిపేజీ తరువాయి – తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. బండి సంజయ్, బీజేపీపై రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిని, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. బండి సంజయ్ పైనా, బీజేపీపైనా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి బీఆర్ఎస్ రాష్ట్రమంతా పోస్టర్లు వేయించిందని విమర్శించారు. బండి సంజయ్ కుటుంబ సభ్యులు తప్పు చేస్తే న్యాయపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కానీ బండి సంజయ్‌ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడమేమిటని ప్రశ్నించారు. బండి సంజయ్‌ని కేటీఆర్ లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల కాలంలో మహిళలపై నేరాలు 67 శాతం పెరిగాయని ఆరోపించారు. మహిళలపై జరిగిన అత్యాచారానికి సంబంధించి కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ బాలిక కేసులో లేదా మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్ళినప్పుడు లేదా తనను ఎమ్మెల్యే వేధిస్తున్నారని ఓ మహిళా సర్పంచ్ ఫిర్యాదు చేసినప్పుడు వారు రాజీనామా చేశారా అని నిలదీశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేతకాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫార్ములా ఈ-కార్ రేసులో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిశాయి కాబట్టే వారిని అరెస్టు చేయడం లేదని ఆరోపించారు.

## విజయ్ ప్రభుత్వం ఆరు నెలలకు మించి ఉండదు

మొదటిపేజీ తరువాయి – రాధాకృష్ణన్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ త్వరలోనే మళ్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ తమిళనాడులో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న రాధాకృష్ణన్.. అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) సీనియర్ నేత, విల్లివాక్కం ఎమ్మెల్యే ఆధవ్ అర్జునకు బహిరంగ సవాల్ విసిరారు. "ఈ ప్రభుత్వం మరో నాలుగు నెలలు మాత్రమే మనుగడ సాగిస్తుంది. ఆధవ్ అర్జున ధైర్యం ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. నేను కూడా చేస్తాను. ఇద్దరం తిరుచెందూర్‌లో పోటీ చేద్దాం. ఇది మా అడ్డా. ఇక్కడ ఎవరినైనా ఓడిస్తాం" అని రాధాకృష్ణన్ సవాల్ విసిరారు. గత 25 ఏళ్లుగా తిరుచెందూర్ స్థానం రాధాకృష్ణన్‌కు బలమైన కోటగా ఉంది. కొళత్తూర్ స్థానంలో మాజీ డీఎంకే నేత వీఎస్ బాబు (టీవీకే) చేతిలో ఓడిపోయిన స్టాలిన్‌ను రాధాకృష్ణన్ ఈ సందర్భంగా వెనకేసుకొచ్చారు. కొళత్తూర్‌ను స్టాలిన్ సింగపూర్‌లా మార్చారని చెబుతూ.. అక్కడి ఓటర్లను 'పనికిరానివారు' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమ నాయకుడు స్టాలిన్ తదుపరి ముఖ్యమంత్రి అవుతారని, ఆయనను తిరుచ్చి నుంచి పోటీ చేయిస్తామని చెప్పారు. తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాల తర్వాత ద్రవిడ పార్టీల నుంచి అధికారం పోవడం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 234 స్థానాలకుగానూ టీవీకే ఒంటరిగానే 108 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 62 ఏళ్లుగా తమిళనాడును పాలిస్తున్న డీఎంకే, ఏఐఏడీఎంకేల జోరుకు విజయ్ బ్రేక్ వేశారు. ఈ నేపథ్యంలో అనితా రాధాకృష్ణన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన వ్యాఖ్యలపై ఇప్పటి వరకు టీవీకే నేతలు స్పందించలేదు.

## రష్యా, ఇరాన్ నుంచి క్యూబా డ్రోన్లు సేకరిస్తున్నట్లు వెల్లడి

మొదటిపేజీ తరువాయి – వెల్లడించింది. దీంతో ట్రంప్ యంత్రాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్రిక్తతలు పెరిగితే గ్వాంటనామో బేలోని అమెరికా నావికా స్థావరం, సైనిక నౌకలు, ఫ్లోరిడాలోని కీ వెస్ట్‌పై దాడులకు క్యూబా అధికారులు ప్రణాళికలు రచించినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. క్యూబాకు రష్యా, ఇరాన్‌లతో పెరుగుతున్న రక్షణ సంబంధాలు, హవానాలో ఇరాన్ సైనిక సలహాదారుల ఉనికిపై అమెరికా ఆందోళన చెందుతోంది. "ఇంత సమీపంలో ఇలాంటి టెక్నాలజీలు ఉండటం ఆందోళన కలిగించే అంశం, ఇదొక పెరుగుతున్న ముప్పు" అని ఒక సీనియర్ అమెరికా అధికారి వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ గురువారం క్యూబాలో పర్యటించి, ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అలాగే, 1996లో రెండు విమానాలను కూల్చివేసిన ఘటనలో క్యూబా మాజీ నేత రౌల్ క్యాస్ట్రోపై అభియోగాలు నమోదు చేసేందుకు అమెరికా న్యాయశాఖ సిద్ధమవుతోంది. అయితే, ఈ ఆరోపణలను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ ఖండించారు. ఆంక్షలు, సైనిక జోక్యాన్ని సమర్థించుకునేందుకే అమెరికా తప్పుడు కేసు బనాయిస్తోందని ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం ఆత్మరక్షణ హక్కు తమకుందని స్పష్టం చేశారు. అయితే, డ్రోన్లు ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని క్యూబా నేరుగా ఖండించలేదు. ఉక్రెయిన్‌లో రష్యా తరఫున పోరాడిన క్యూబన్ సైనికులు డ్రోన్ యుద్ధ తంత్రాలపై అవగాహన పెంచుకున్నారని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ, ఇది 1962 నాటి క్షిపణి సంక్షోభం లాంటి తక్షణ ముప్పు కాదని, కానీ తమ దేశానికి అత్యంత సమీపంలో ఉండటం మాత్రం తీవ్రమైన విషయమేనని అధికారులు స్పష్టం చేశారు.

## మన దేశం గురించి తెలియకనే ఆ విమర్శలు'

మొదటిపేజీ తరువాయి – సామాజిక, ప్రజాస్వామ్య వ్యవస్థపై కనీస అవగాహన, తగిన సమాచారం లేకపోవడం వల్లే ఇలాంటి విమర్శలు చేశారని తిప్పికొట్టింది. ది హేగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సిబి జార్జ్ మాట్లాడుతూ.. కేవలం అజ్ఞానం వల్లే ఇలాంటి ప్రశ్నలు, ఆరోపణలు ఎదురవుతున్నాయని స్పష్టం చేశారు.

### రోబ్ జెట్టన్ ఏమన్నారంటే..

ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశానికి ముందు రోబ్ జెట్టన్ భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో కేవలం పత్రికా స్వేచ్ఛతో పాటు మైనారిటీల హక్కులు ఒత్తిడిలో ఉన్నాయని నిరాధార ఆరోపణలు చేశారు. దీనిపై తమ ప్రభుత్వం ఆందోళన చెందుతోందని ఓ వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఇలాంటి అంశాలను తాము క్రమం తప్పకుండా భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. డచ్ ప్రధాని వ్యాఖ్యలకు భారత్ తన ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేసేలా గణాంకాలతో కూడిన కౌంటరిచ్చింది. భారత్ 140 కోట్ల జనాభాతో, 5,000 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన గొప్ప వైవిధ్యభరితమైన దేశమని జార్జ్ గుర్తుచేశారు. హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మతాలు ఇక్కడే పుట్టాయని తెలిపారు. అన్ని మతాలు శతాబ్దాలుగా వర్ధిల్లుతున్నాయని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ మంది ఓటర్లు పాల్గొనడమే భారత ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు దేశంలో మైనారిటీల జనాభా 11 శాతంగా ఉంటే ప్రస్తుతం అది 20 శాతానికి పైగా చేరిందని ఇది మన సమ్మిళితత్వానికి నిదర్శనమని జార్జ్ కౌంటర్ ఇచ్చారు. అయితే, మోదీతో భేటీ అనంతరం డచ్ ప్రధాని జెట్టన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇరు దేశాలూ ప్రజాస్వామ్యానికి, సుపరిపాలనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తాయని పేర్కొనడం గమనార్హం.

## నేడు కేరళ సీఎంగా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం

మొదటిపేజీ తరువాయి – చేయనున్నారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో ఈ కార్యక్రమం జరగనుంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఘన విజయం సాధించడంతో పదేళ్ల విరామం తర్వాత తిరిగి అధికారంలోకి వస్తోంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. కాగా, కేరళ 13వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఒక రోజు ముందు, ఆదివారం సతీశన్ ప్రముఖ కార్డినల్ మోరన్ మోర్ బసిలియోస్ క్లెమిస్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్డినల్ క్లెమిస్ బావా అందించిన దీవెనలు, శుభాకాంక్షలు తనకు ఎంతో బలాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చాయని సతీశన్ ఎక్స్ వేదికగా తెలిపారు. అన్ని వర్గాలను గౌరవిస్తూ, కేరళ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో కలిపి కొత్త మంత్రివర్గంలో 21 మంది సభ్యులు ఉండనున్నారు. రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ముఖ్యమంత్రి పదవి సహా కాంగ్రెస్‌కు 11 మంత్రి పదవులు దక్కనున్నాయి. మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)కు ఐదు మంత్రి పదవులు లభించే అవకాశం ఉంది. ఐయూఎంఎల్ నుంచి పీకే కున్హాలికుట్టి, కేఎం షాజీ, ఎన్. షంసుద్దీన్, పరక్కల్ అబ్దుల్లా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే, పీకే బషీర్‌కు మంత్రి పదవి ఇచ్చే విషయంలో పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

## నేను ఎమ్మెల్యే కావాలనే ఆశ నాకంటే మీకే ఎక్కువగా ఉన్నట్టుంది

మొదటిపేజీ తరువాయి – స్పందిస్తూ.. "నేను ఎమ్మెల్యే కావాలనే ఆశ నాకంటే మీకే ఎక్కువగా ఉన్నట్టుంది" అంటూ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అలాగే ఆత్మహత్య చేసుకున్న సతీష్ అనే వ్యక్తి కుటుంబానికి ఏ ఫార్మా కంపెనీ నుంచి డబ్బులు అందాయో ఆధారాలతో సహా చెప్పడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అయితే తాను ఆ విషయం బయటపెట్టిన వెంటనే సదరు కంపెనీతో అలా జరగలేదని చెప్పించే కుట్రలు కూడా జరుగుతాయని అన్నారు. గత ఎన్నికల సమయంలో తనపై జరిగిన దుష్ప్రచారాన్ని, అవినీతి ఆరోపణలను ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన "ఆడుదాం ఆంధ్రా" కార్యక్రమంలో తాను ఏకంగా రూ. 600 కోట్లు అవినీతికి పాల్పడ్డానని కూటమి నేతలు అప్పట్లో ఆరోపించారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం అధికారంలోకి వచ్చి విచారణ జరిపించిన తర్వాత, విజిలెన్స్ నివేదికలో కేవలం రూ. 40 కోట్ల అక్రమాలే ఉన్నాయని తేలిందని, మరి మిగిలిన మొత్తానికి సమాధానం ఏంటని ప్రశ్నించారు. ఇంత కాలం గడిచినా తనపై చేసిన ఒక్క ఆరోపణనైనా నిరూపించగలిగారా అని ప్రశ్నించారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో బీజేపీ నేత టీజీ వెంకటేష్‌పై కూడా స్పందిస్తూ.. ఆయన తన గౌరవాన్ని కోల్పోయి అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒకప్పుడు మీసాలు తిప్పుకుంటూ తిరిగిన కొందరు నేతలు, ఇప్పుడు మీసాలు దించుకుని మీ దగ్గరకు ఎందుకు వచ్చారో సమాధానం చెప్పాలంటూ పరోక్షంగా చురకలు అంటించారు. కుటుంబ మరియు అంతర్గత రాజకీయాలపై మాట్లాడుతూ, బైరెడ్డి శబరిని కూడా ఆయన గట్టిగా టార్గెట్ చేశారు. గతంలో శబరి తండ్రిని గౌరు వెంకటరెడ్డి 'వేస్ట్ ఫెలో' అని అన్నప్పుడు, అలాగే రాజశేఖర్ రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఏం సాధించాడంటూ మాండ్ర శివానందరెడ్డి విమర్శించినప్పుడు శబరి ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎంబీబీఎస్, పీజీ సీట్లు కొనిపించిన సొంత తండ్రిపై అంతటి విమర్శలు వస్తున్నా ఆమె స్పందించకపోవడం ఏంటని నిలదీశారు. చివరగా తన రాజకీయ భవిష్యత్తుపై క్లారిటీ ఇస్తూ.. "నాకు రూపాయి ఆస్తి లేదు, కష్టమొచ్చినా నష్టమొచ్చినా నేను ప్రజల కోసమే నిలబడతాను.. నాకున్న ఏకైక బలం జగన్ మాత్రమే" అని స్పష్టం చేశారు.

## 'బాదుడే బాదుడు'కు బ్రాండ్ అంబాసిడర్ గొడ్డలి పార్టీ

మొదటిపేజీ తరువాయి – విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై వైసీపీ చేస్తున్న ఆందోళనలు ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ నాటకమని ఆయన ఆరోపించారు. సోమవారం నాడు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరల పెంపును ప్రస్తావిస్తూ వైసీపీపై విరుచుకుపడ్డారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, డాలర్ మారకం విలువ, ఇరాన్, ఇజ్రాయిల్-అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం వంటి కారణాలతోనే ఇంధన ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని కూన రవికుమార్ వివరించారు. ఈ వాస్తవాలను దాచిపెట్టి, కూటమి ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలోనే ప్రజలపై పెట్రో భారాలు మోపారని ఆయన ఆరోపించారు. ఆ ఐదేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు ఏకంగా రూ.41 పెరిగాయని గుర్తుచేశారు. దీనికి విరుద్ధంగా, 2014 నుంచి 2019 మధ్య టీడీపీ పాలనలో ధరలు కేవలం రూ.13 మాత్రమే పెరిగాయని, అప్పుడు కూడా కేంద్రం ధరలు పెంచితే, చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర ఆదాయాన్ని తగ్గించుకుని ప్రజలకు రూ.2 ఉపశమనం కల్పించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్రోల్‌పై వ్యాట్‌ను 31 శాతం నుంచి 35 శాతానికి, డీజిల్‌పై 22.25 శాతం నుంచి 27 శాతానికి పెంచిందని కూన రవికుమార్ ఆరోపించారు. దీనికి అదనంగా లీటర్‌కు ఫిక్స్‌డ్ వ్యాట్, రోడ్ డెవలప్‌మెంట్ సెస్ పేరుతో ప్రజలపై అదనపు భారం మోపారని పేర్కొన్నారు. రోడ్ల అభివృద్ధి పేరుతో వేల కోట్లు వసూలు చేసినా, రాష్ట్రంలో కనీసం గుంతలు కూడా పూడ్చలేదని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్, దేశంలోనే అత్యధిక ఇంధన ధరలున్న రాష్ట్రంగా మారిందని, పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే లీటర్‌కు రూ.5 నుంచి రూ.10 వరకు అధికంగా వసూలు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా వ్యాట్ లేదా సెస్ పెంచలేదని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ కార్యకర్తలు నిజంగా ప్రజల పక్షాన పోరాడాలనుకుంటే, ఐదేళ్లలో ప్రజలపై పెట్రో భారం మోపిన జగన్ నివాసం ముందు తాడేపల్లిలో ధర్నా చేయాలని సూచించారు. ప్రజలు చైతన్యవంతులని, వైసీపీ చేస్తున్న ఫేక్ రాజకీయాలను నమ్మే స్థితిలో లేరని కూన రవికుమార్ అన్నారు.

## నిజామాబాద్ జిల్లాకు రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారు

మొదటిపేజీ తరువాయి – అర్వింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లాను పూర్తిగా విస్మరించి ప్రజలకు 'పంగనామాలు' పెట్టారని మండిపడ్డారు. ముఖ్యంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కాలనే కుట్రతోనే, ఆయన సొంత జిల్లా అయిన నిజామాబాద్‌కు రేవంత్ రెడ్డి మొండిచేయి చూపించారని ఆరోపించారు. జిల్లాకు ఇంత అన్యాయం జరుగుతుంటే మహేష్ కుమార్ గౌడ్ ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఇక్కడ తిరుగుతున్నారంటూ అరవింద్ ఘాటుగా ప్రశ్నించారు. నిజామాబాద్ నగరానికి ఔటర్ రింగ్ రోడ్ ఇస్తామని నాడు హామీ ఇచ్చి, నేడు ఆ ఊసే ఎత్తకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, దీనికి ప్రజలే త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిజామాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పన, డ్రైనేజీ పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అర్వింద్ విమర్శించారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ. 162 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం కేవలం రూ. 10 కోట్లు మాత్రమే కేటాయించిందని, కనీసం 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదని వివరించారు. దేవుళ్ళకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చకుండా మోసం చేసిన రేవంత్ రెడ్డికి, ప్రజలను మోసం చేయడం ఒక లెక్కా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ హయాంలో ఈ డ్రైనేజీ పనులు ఎప్పటికీ పూర్తికావని ఆయన కుండబద్దలు కొట్టారు. బుల్లెట్ రైల్ కారిడార్, 'ఫ్యూచర్ సిటీ' వ్యవహారాల్లో కూడా ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, గతంలో నగరాన్ని అప్‌గ్రేడ్ చేస్తానన్న కేసీఆర్‌నే నమ్మని ప్రజలు, ఇప్పుడు రేవంత్ రెడ్డి చెబుతున్న లేని ఫ్యూచర్ సిటీని అస్సలు నమ్మరని చురకలు అంటించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు, జాతీయ పరిణామాలపై అర్వింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2039 వరకు రాహుల్ గాంధీ దేశ ప్రధాని కాలేరని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డే ప్రకటించారని, దీనర్థం దేశంలో ఇంకో పదేళ్ల పాటు బీజేపీ అధికారంలోనే ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నట్లేనని విశ్లేషించారు. రేవంత్ రెడ్డి మోసపూరిత రాజకీయ నాయకుడని... కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి నిజాయతీ గల నాయకుడిని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమిస్తే బాగుంటుందని కాంగ్రెస్ అధిష్ఠానానికి అర్వింద్ సూచించారు.

## ఇరాన్-అమెరికా యుద్ధానికి తెర?..

మొదటిపేజీ తరువాయి – వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ద్వారా ఈ ప్రతిపాదనను వాషింగ్టన్‌కు చేరవేసినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో ఉంది. చర్చల్లో ప్రధాన మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ ఈ విషయాన్ని నివేదించింది. "మనకు ఎక్కువ సమయం లేదు" అని ఆ వర్గాలు వ్యాఖ్యానించినట్లు పేర్కొంది. శాంతి చర్చలు స్తంభించిన తరుణంలో ఇరుపక్షాలు తమ లక్ష్యాలను పదేపదే మార్చుకుంటున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. మరోవైపు అమెరికా పంపిన శాంతి ప్రతిపాదనకు తాము స్పందించామని ఇరాన్ నేడు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య సందేశాల మార్పిడి జరుగుతోందని తెలిపింది. అయితే, అమెరికా డిమాండ్లు మితిమీరి ఉన్నాయని ఇరాన్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించకపోవడం, ఇరాన్ కేవలం ఒకే ఒక్క అణు కేంద్రాన్ని కలిగి ఉండాలనేవి అమెరికా ప్రధాన డిమాండ్లలో ఉన్నాయని ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి స్పందించారు. "మా ఆందోళనలను అమెరికా దృష్టికి తీసుకెళ్లాం. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో చర్చలు జరుగుతున్నాయి" అని ఆయన మీడియా సమావేశంలో తెలిపారు. ప్రస్తుతానికి యుద్ధాన్ని ముగించడంపైనే తమ పూర్తి దృష్టి ఉందని, ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన సంకేతాలిచ్చారు.

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

ఈ చర్చలు కొనసాగుతుండగానే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిన్న ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "ఇరాన్‌కు సమయం మించిపోతోంది. వారు వేగంగా కదలాలి, లేదంటే ఏమీ మిగలదు. సమయం చాలా కీలకం!" అని తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. అలాగే, ఫార్చ్యూన్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. "ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ ఆరాటపడుతోంది. కానీ, వారు ఒక ఒప్పందం చేసుకుని, ఆ తర్వాత దానికి ఏమాత్రం సంబంధం లేని పత్రాలను పంపిస్తారు" అని అసహనం వ్యక్తం చేశారు. ఇరాన్‌తో యుద్ధం ముగిసే వరకు వడ్డీ రేట్ల కోతపై నిర్ణయం కోసం వేచి ఉండాల్సి రావచ్చని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న శాంతి ప్రయత్నాలు ఫలించి, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయో లేదో వేచి చూడాలి.

## రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక పథకం

మొదటిపేజీ తరువాయి – అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ వినూత్న పథకం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఏమిటంటే.. ఏదైనా అనుకోని ప్రమాదం లేదా ప్రకృతి విపత్తు జరిగి ఒక కుటుంబానికి జీవనాధారమైన యజమాని అకాల మరణం చెందితే, ఆ కుటుంబం ఆర్థికంగా కుప్పకూలిపోకుండా కాపాడటమే. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సదరు కుటుంబం రోడ్డున పడకుండా, వారి పిల్లల చదువులు, భవిష్యత్తు ఆగమైపోకుండా అండగా నిలిచేందుకు ఈ రూ. 5 లక్షల భారీ ఇన్సూరెన్స్ రక్షణను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పించనుంది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వమే పూర్తిగా భరించడం విశేషం.

### ప్రపంచంలో అత్యధిక దోమలు ఉన్న టాప్ 10 దేశాలు ఇవే?

ఇంతటి భారీ మరియు సంక్లిష్టమైన పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, నిబంధనలు, పూర్తి స్థాయి విధివిధానాలను (+బఅఎవశ్రీఅఅవం) ఎటువంటి లోపాలు లేకుండా ఖరారు చేయడం అత్యంత కీలకం. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక ఉన్నత స్థాయి కేబినెట్ సబ్ కమిటీని (మంత్రుల ఉపసంఘం) ప్రత్యేకంగా నియమించింది. ఈ కమిటీ భీమా సంస్థలతో సంప్రదింపులు జరపడంతో పాటు, క్షేత్రస్థాయిలో పథకం ఎలా సమర్థవంతంగా అమలు కావాలో ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.

## కరుణరస స్ఫోరకం ఘజ్నవీ ఖండిక

మహాకవి జాషువా రాసిన ఫిరదౌసి కావ్యం తెలుగునాట సుప్రసిద్ధం. 'రాజు మరణించె ఒక తార రాలిపోయె/ కవియు మరణించె ఒక తార గగనమెక్కె/రాజు జీవించు రాతి విగ్రహములందు/సుకవి జీవించు ప్రజల నాలుకల యందు' అనే పద్యం ఇప్పటికీ కవులు వేదిక మీద నిత్యనూత నంగా ఆలపిస్తున్నారు. ఫిరదౌసి కవి విషాద జీవితాన్ని జాషువా కవి రాయడం కన్నా ముందు సురవరం ప్రతాపరెడ్డి 'సుల్తాన్ మహమూద్ ఘజ్నవీ' అనే ఖండిక రాశారు. ఇది చారిత్రక, కవి జీవితానికి సంబంధించిన కథ. 174 పంక్తుల గీతమాలికలో రాసింది. ఈ మాలిక 1923లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం నుంచి వెలువడిన 'రెడ్డి రాణి' అనే పత్రికలో అచ్చయింది. (సంగిశెట్టి శ్రీనివాస్ సంకలనం చేసిన సురవరం కవిత్వం పుస్తకానికి సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ముందుమాట). ఇందులోని అంశం భారతదేశంపై అనేకమార్లు దండయాత్రలు చేసిన మహమూద్ ఘజ్నవీ చరిత్ర తెలుపడం. మహమ్మదీయులు భారతదేశంపైకి చొరబడడం అతనితోనే మొదలు. హిందువులు ఎంత గొప్పవీరులై అతనినెదిరించారో ఇందులో వివరించారు. సుమారు 95 పంక్తుల తేటగీతిమాలికలో గజనీ దాడులను, హిం దూదేశాన్ని కొల్లగొట్టడం గురించే వివరించారు. భరత ఖండపు పచ్చిమ భాగమందు/కలదు 'కాబూలు' దేశంబు ఖ్యాతి గాం చి/దానినేలె 'సుబక్తగీన్' ధర్మబుద్ధి/తండ్రి పిమ్మట' మహమూదు తక్తు నెక్కె/ఎక్కి పరరాష్ట్రముల జేర్చి యింపుగాంచె/నంత నతడు హిందూస్థానమంత గెలిచి/ధనముగూర్చి యిస్లాముదనర జేయ/దలచి పలుమాఱు తమి మీద దాడి వెడలె..ఇట్లా అతడు కాబూలు వాడని తండ్రి తరువాత రాజై పొరుగువారిని జయించాడని, ఆ తర్వాత హిందూదేశాన్ని కొల్లగొట్టాలని దాడులు జరిపాడని మొదలవుతుంది. ఒక కథ చెప్పినట్లుగా చరిత్రను సవివరంగా చెప్పారు. 'తక్తు' అనేది మహమ్మదీయులు వాడుకునే మాట. గద్దెనెక్కె అని అర్థం. సింహాసనం అని మనవాళ్లు వాడుకునే మాటకు పర్యాయం వంటిది. సురవరం ఈ ఖండిక రాసేనాటికి నిజాం ప్రభుత్వమే నడుస్తున్నది. తక్తుపై నిజాం ఉన్నాడనేది సాధారణ వాడుక. అదే ఇందులో ప్రయోగించడం సాధారణ ప్రజలకు తెలియడం, ఇస్లాం కథ కనుక వారి పదాన్నే ప్రయోగించడం ఒక ఔచిత్యం. ఈ సుదీర్ఘ గీతమాలికలో దాదాపు 20 పంక్తుల్లో ఫిర్దోసి అనే కవి జీవితానికి సంబంధించినది. జాషువా రచించిన సుప్రసిద్ధ ఫిరదౌసి కావ్యం కన్నా తొమ్మిది సంవత్సరాలు ముందుగా దీనిని రాశారు. సంపన్నుడైన రాజును కవులు ఆశ్రయించారు. అందులో 'ఫిర్దోసి' ఒకరు. ఆతనినే రాజు ఆదేశించాడు.. తన చరిత్రను కావ్యం గా రాయాలని. అందుకు పద్యానికొక అష్రఫీ ఇస్తానని వాగ్దానం చేశాడు.

ఘజ్నవీ ఫిర్దోసి కొక్క వాగ్దాన మిచ్చె
పద్యమున కొక్క యష్రఫీ వరుసనొసగ
అర్థలక్ష పద్యంబుల నతడు వ్రాసి
పాదుషా మ్రోల నిలిచిన పలికె రాజు
'ఓయి! ఫిర్దోసి యష్రఫీలొసగ జాల
వాని మారుగ రూప్యముల్ పరగ నిత్తు'..

ఇందులో అష్రఫీ అంటే బంగారు నాణేలు, రూప్యములు అంటే వెండి నాణేలు అని అర్థం. మోసం చేసిన రాజును నిందించి కవి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తరువాత ఒకనాడు మరో కవి ఫిర్దోసి రాసిన కావ్యంలోని పద్యాలను ఘజ్నవీ ముందు పాడి విన్పించాడు. అది విని అవి ఫిర్దోసీ పద్యాలని తెలుసుకొని ఆ కవికి చేసిన అన్యాయం దిద్దుకోవాలని భటులతో తానే కవి వద్దకు వెళ్లాడు. కానీ అప్పటికే ఆ కవి తనువు చాలించాడు. తాను తెచ్చిన ధనమంతా ఫిర్దోసి ఆత్మజులకు అందించాడు. కానీ చివరి కథలో గజనీ తనకు విజయాలను చేకూర్చిన అశ్వాలను, తాను సంపాదించిన ధనరాశు లను, కోటబురుజులను చూసి వాటిని విడలేని దుఃఖాన్ని అనుభవించాడు. కన్నీరు కార్చి కార్చి మరునాడే యముని వద్దకు చేరుకున్నాడు. కొద్దిభాగంలో కవి పరిస్థితిని ఆర్ద్రంగా రచించారు సురవరం. కానీ అనేక విజయాలను సాధించిన ఘజ్నవీ జీవితంలో తెచ్చిన పెనుమార్పులకు ఈ కవి కథ కారణమైంది. ఘజ్నవీ తన అశ్వాలను, ధనరాశులను, చూసి మురిసిపోయి, చరమదశలో వాటిని వదలలేని పరితాపానికి గురయ్యాడు. పరిపరివిధాల వేదనను అనుభవించాడు. అతని వేదన మాన్పించగల దక్షులెవరూ లేరు. కన్నీరు కార్చాడు. ఈ దృశ్యాన్ని కరుణరస స్ఫోరకంగా రాశారు సురవరం. ముగింపుగా ఒక సఅందించే చరణాలు రాశారు.

చావుబ్రతుకులు తిరుగును చక్రగతిని
'సోక్రటీ'సేగె శేషించె సాత్వికంబు
'సీజరేగి'నను ప్రతాపి శిఖలు వెలసె
'కృష్ణరాయలు' వెడలిరి కీర్తి మిగిలె
వీరి తనువులు మట్టిలో చేరిపోయె
మూఢబుద్ధిని గలిగె మహమూద నీకు
బియ్యమున నూలు గలిసిన
విధము చూవె
భూమిపై హెచ్చుతగ్గులు పొసగి యుండు
భువనముల నెల్ల సాధించి పూర్ణముగను
పావనాత్మను గోల్పోవ ఫలముగలదె'
యనెడి నీతికి లక్ష్యమై యవతరించి
తేమొ కాని నీ ఘనత యింకెందు గలదు?

ఎంత ప్రపంచాన్ని జయించినా పావనాత్మను, పవిత్రత లేని, నీతి ధర్మం పాటించని వారికి ఘనత ఏముంటుంది? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు ఎంతటివాడైనా నీతి ధర్మం పాటించడమే లక్ష్యం కావాలనే మానవీయ సందేశం ఉంది. ఇది చారిత్రక ఖండ కావ్యం. ఇందులో ఫిర్దోసి (సురవరం ఇట్లే రాశారు, జాషువా ఫిరదౌసి అని వాడారు).

# తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ





**నిజం న్యూస్ హైదరాబాద్, మే 18:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు.బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు.మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు. జెండా గద్దె బేస్ కు గ్రీన్ కలర్.. పై భాగంలో ఉండే జెండా గద్దె కు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**నిజం న్యూస్ మేడ్చల్, మే 18:** సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆఫీసులో జరిగిన జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు ,జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో సహా మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కేపీహెచ్బీ లోని ఎన్టీఆర్ స్కూలుకు సంబంధించి ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించామని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు ఆగడంపై.. ఆ విషయమై ఎన్నోసార్లు కలెక్టర్ కి నివేదించామని... ఆ స్థలాన్ని జిహెచ్ఎంసికి కేటాయించి.. స్కూల్ నిర్మాణం పూర్తి చేసే విధంగా అధికారులకు సూచనలు ఇవ్వాలని ..సొంత నిధులతో స్కూల్ నిర్మిస్తామన్నా కూడా ముందుకు రావడం లేదని తెలిపారు ..అలాగే ఫతేనగర్ డివిజన్ అమృత తండాలో ఉంటున్న నిరుపేదలుకు కట్టిన డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని తెలిపారు.. అలాగే ఖైరతాబాద్... ఖూనదీ లో జిహెచ్ఎంసి స్థలాలలో కూడా హౌసింగ్ బోర్డు వారు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని.. ఇవి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని సూచించారు... అలాగే ప్రశాంత్ నగర్ లోని హెల్త్ సెంటర్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించామని ఇప్పటికే పనులు ప్రారంభించాలని అధికారులకు తెలిపామని.. ఆ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని .. ఖూనదీ లోని 100 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేసే విధంగా చూడాలని.. దీనికి టెండర్లు కూడా పూర్తి చేసి గుత్తేదారిని కూడా నియమించడం జరిగిందని ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేస్తే నిరుపేదలకు ఉపయోగపడుతుందని.. అలాగే నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని పెండింగ్లో ఉన్న పనులు కూడా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సమావేశంలో కోరారు..

# అప్పు తిరిగి ఇవ్వమని అడిగిన 8 మందిని చంపాలి అనుకున్న దంపతులు

మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో జంట మహిళల హత్య కేసులో వీడిన మిస్టరీ

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 18:** అప్పులు ఇచ్చిన వాళ్ళని మొత్తం ఎనిమిది మందిని చంపేందుకు ప్లాన్ చేసిన కరీమాబీ దంపతులు ముందుగా ఎనిమిది మందిలో ఇద్దరిని హత్య చేసిన కరీమాబీ దంపతులు మరో ఆరుగురిని కూడా చంపేందుకు ప్లాన్ చేసి ఫామ్ హౌస్‌కు పిలవగా.. కరీమాబీ నుంచి ప్రాణహాని ఉందంటూ పోలీసులు ఆశ్రయించిన ఆరుగురు మహిళలు డబ్బులు ఇస్తానని చెప్పి ఫామ్ హౌస్‌కి పిలిచి తాండూరుకు చెందిన మహిళల్ని చంపేసిన కరీమాబీ

# ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన గద్వాల జిల్లా జనసేన సభ్యులు




**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 18:** సోమవారం గద్వాల్ జిల్లా మనపాడు మండలం నూతన జనసేన సభ్యులు మహబూబ్ నగర్ పార్లమెంట్ , సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ని కుకట్ పల్లి ఖూనదీ కాలనీ 5 వ ఫేస్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాదక పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ పార్టీ లో నూతన సభ్యత్వం తీసుకున్న వారికి ధన్యవాదాలు తెలిపి, అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను మనపాడు మండలం లోని ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని, ప్రజాసమస్యల పై అవగాహన చేసుకొని పోరాడి ప్రజలకు అండగా నిలిచి సీనియర్ నాయకులతో కలసి పార్టీ ని బలోపేతం చేయాలని సూచించారు .

# 10 లక్షలకు 'నీట్' పేపర్ కొంటే 720 మార్కులకు 107 మార్కులొచ్చాయి!

కొడుకు కోసం 10 లక్షలు పెట్టి పేపర్ కొనుగోలు చేసిన తండ్రి



**నిజం న్యూస్ హైదరాబాద్, మే 18:** కొడుకు ఫెయిల్ దినేశ్ బివాల్ అనే వాడు తన కొడుకు రిషి కోసం 10 లక్ష లు పెట్టి నీట్ పేపర్ కొన్నాడు కాని రిషి గాడు ముందే పేపర్ ఇచ్చినప్పటికి ఘోరం గా ఫెయిల్ అయ్యాడు. ఎంత ఘోరం గా ఫెయిల్ అయ్యాడు అంటే 720 మార్కులకు 107 మార్కులు వచ్చాయి .వీనికి పరీక్ష పేపర్ ముందే ఇవ్వకుంటే 5 మార్కులు కంటే ఎక్కువ వచ్చేవి కావు ఇటువంటి లోఫర్ గాడు పొరపాటున నీట్ పాస్ అయి డాక్టర్ అయి ఉంటే ఎంత మందిని చంపే వాడో పశువులు కాయటానికి కూడా పనికి రాని కొడుక్కి నీట్ (మెడికల్ ) పరీక్ష పేపర్ కొని ఇచ్చిన తండ్రి ని చెప్పుతో కొట్టాలి

# ప్రజావాణికి(92)ఫిర్యాదులు





**నిజం న్యూస్ రంగారెడ్డి, మే 18:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (92) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ--32, ఇతర శాఖలు -60 , మొత్తం 92 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ జనాభా గణన-2027 కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఇంటిని కవర్ చేయాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఏ ఒక్క కుటుంబం మిగలకుండా అన్ని కుటుంబాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి ప్రజల సహకారం పొందాలని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియను అధికారులు నిర్దేశిత గడువులోపు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ( రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్) జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి రంగారెడ్డి జిల్లా చే జారీ చేయనైనది.

# క్యాంపు కార్యాలయంలో మహిళా నాయకులతో సమావేశమైన కూకట్పల్లి ఎమ్మెల్యే: మాధవరం కృష్ణారావు

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 18:** సోమవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మహిళా నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పరిపాలనపై ఇప్పటికే ప్రజలు విసిగి పోయారని.. అబద్ధపు హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండున్నర సంవత్సరాల కాలం గడిచినా చేసింది ఏమీ లేదని.. ముఖ్యంగా మహిళలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా తులం బంగారం ఇస్తామని అలాగే ప్రతి మహిళకు 2500 ఇస్తామని చెప్పి అధికారంలోకి రావడం జరిగిందని.. అంతేకాకుండా ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ తప్ప బతుకమ్మ చీరలు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన లక్ష రూపాయలు కళ్యాణ్ లక్ష్మీ షాదీ ముబారక్ పథకం , బతుకమ్మ చీరలు, పెన్షన్ 200 నుంచి 2000 చేయడం ఇటువంటి మంచి నిర్ణయాలు ఆయన తీసుకున్నదే తప్ప... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క మంచి పని కూడా చేయలేదని... కెసిఆర్ కట్టిన డబుల్ బెడ్ రూములు కూడా ఇప్పటికే 40 వేలకు పైగా ఉన్నాయని కనీసం అవి కూడా ఇవ్వడం లేదని అన్నారు... ఎక్కడ చూసినా వ్యర్థాలు పెరిగిపోయి దోమలు బెడద ఎక్కువైందని.. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని.. కనీసం దోమల మందు కూడా పిచికారి చేయడం లేదని, అలాగే మంచినీటి సమస్యలు తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రజారోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకునేవారని.. మంత్రులు ముఖ్యమంత్రితో సహ ఎవరిష్టారాజ్యంగా వాళ్ళు ఉంటూ.. ప్రజా పరిపాలన గాలికి వదిలేసారని తెలిపారు.. ఈ సందర్భంగా ప్రజల్లో ఉంటూ ప్రజలకి బిఆర్ఎస్ పార్టీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ మనం ముందుకు వెళదామని... అలాగే ఈ నెల 25వ తారీఖున బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారధ్యంలో కూకట్పల్లి నియోజకవర్గంలోని కార్యకర్తల సమావేశానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని.. తిరిగి మళ్లీ భవిష్యత్తులో కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా చేసుకుని తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం అని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా ,మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల బాబురావు, అనిత శ్రీపాద్ తదితరులు పాల్గొన్నారు...





# జిహెచ్ఎంసి ఎన్నికలపై అధికారిక వివరణ..

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 18:** జీహెచ్ఎంసీ (+ఎవీజ), ఇతర మున్సిపల్ ఎన్నికల వార్డు రిజర్వేషన్లపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అబద్ధం. ఈ వార్తలు ప్రజలను తీవ్రంగా తప్పుదారి పట్టిస్తున్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం వాస్తవాలు: జీహెచ్ఎంసీ గానీ, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) గానీ వార్డుల రిజర్వేషన్లకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఎన్నికల వార్డుల రిజర్వేషన్ లిస్ట్ ఇంకా అస్సలు ఖరారు కాలేదు. ప్రస్తుతం సోషల్ మీడియా లేదా ఇతర ప్లాట్‌ఫారమ్‌లలో ప్రచారంలో ఉన్న జాబితాలు, చార్టులు లేదా రిజర్వేషన్ వివరాలకు.. ప్రభుత్వ అధికారిక ప్రకటనలకు ఎలాంటి సంబంధం లేదు.. అధికారిక, నమ్మకమైన సమాచారం కోసం పౌరులు కేవలం రాష్ట్ర ఎన్నికల సంఘం, సంబంధిత అధికారులు విడుదల చేసే నోటిఫికేషన్లను మాత్రమే నమ్మాలని కోరుతున్నాము.. తెలంగాణ ప్రభుత్వం

# బక్రీద్ తేదీ ప్రకటించిన ముస్లిం మత పెద్దలు.

మే-28-2026 గురువారం బక్రీద్ పండుగ

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 18:** భారత్లో ముస్లింల పవిత్ర పండుగ ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) మే 28న జరుపుకోనున్నారు.కొత్త ఇస్లామీయ నెల ప్రారంభాన్ని సూచించే చంద్రుని నెలవంక దేశంలో కనిపించకపోవడంతో, ముందుగా భావించిన మే 27కు బదులుగా 28న పండుగ నిర్వహించాలని ముస్లిం మత పెద్దలు ప్రకటించారు.దారుల్ ఖజా కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది.దీంతో దేశవ్యాప్తంగా ప్రత్యేక నమాజులు, ఖుర్బానీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా సర్కార్ సెలవు ప్రకటించే అవకాశం ఉంది.

# క్రీడల ద్వారా నాయకత్వం, ఆరోగ్యం మెరుగుపడతాయి: శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్




**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, మే 18:** క్రీడల ద్వారా క్రమశిక్షణ,నాయకత్వం,ఆరోగ్యం పెరుగుతాయని భావించి రాష్ట్ర ప్రభుత్వం యువ క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు,శిక్షణ,ప్రోత్సాహకాలు అందిస్తోందని అన్నారు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ .ఆత్మవిశ్వాసం ఉన్న యువతే బలమైన తెలంగాణకు పునాది" అనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ుఖఖీ×ణజ చైర్మన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా నర్సింహా రెడ్డి అన్నారు.సోమవారం చందానగర్ డివిజన్ యువ నాయకులు కట్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పీజేఆర్ స్టేడియం నందు కట్ల మల్ల రెడ్డి మెమోరియల్ వాలీ బాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ను చైర్మన్ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లా నర్సింహా రెడ్డి గారు,ఒబిసి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్,మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు,టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు గౌరవ శ్రమ శక్తి అవార్డ్ గ్రహీత నల్ల సంజీవ రెడ్డి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోర్డినేటర్ శ్రీ రఘునందన్ రెడ్డి,చందానగర్ సిఐ,శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు,ప్రజలతో కలిసి వీక్షించి విజేతలకు బహుమతులు అందజేశారు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ గారు.

# అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు త్రాగు నీటి ఇబ్బందులు.

సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్.



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, మే 18:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పోచమ్మ దేవాలయం వద్ద అధికారులు, కాంట్రాక్ట్ నిర్లక్ష్యం వల్ల ప్రజలు తాగే మంచి నీళ్ల పైపుకు రంధ్రం పడడం వల్ల మున్సిపల్, వాటర్ డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయం లోపం వల్ల నీటి సరఫరా ఆగిపోయింది. ఈ సమాన్వయం లోపని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, వాటర్ డిపార్ట్మెంట్ వల్ల సమన్వయ లోపం వల్ల సామాన్య ప్రజలకు నీళ్లు రావడం లేదు అని అన్నారు. ప్రజలకు నీళ్లు అధించవలసిన వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు, రోడ్డులు ఇతర సౌకర్యాలు సమాకూర్చే మున్సిపల్ అధికారుల సమన్వయ లోపం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బదులకు గురి అవుతున్నారు అని గుర్తు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక రోజు నీళ్లు రాకపోతే నెల బిల్లులో ఒక రోజు బిల్ కట్ చేసి ఇస్తారా అని ప్రశ్నించారు. కనుక నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్ట్ లైసెన్సు వెంటనే రద్దు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ బాట పట్టిన తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



**నిజం న్యూస్ హైదరాబాద్, మే 18:** మంత్రి వర్గ విస్తరణ, ప్రక్షాళన జరుగుతుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో మంత్రి పదవి కోసం లాబీయింగ్ మొదలు పెట్టిన ఆశావహులు ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసి చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్నానని తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఈ విషయం తెలిసి హుటాహుటిన ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీని కలిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుండి తనకే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.

# ఈ చిట్కాలు పాటిస్తే మీరు ధనవంతులే.. మీ ఆదాయం పదింతలు

జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ అనేక విధాలుగా కష్టబడతారు. ఉద్యోగం, వ్యాపారం, పెట్టుబడులు తదితర వాటి ద్వారా డబ్బులు సంపాదించడానికి ప్రయత్నిస్తారు. వచ్చిన ఆదాయాన్ని పొదుపుగా ఖర్చుచేసి, మిగిలిన దాన్ని దాచుకుంటారు. సాధారణంగా ఎక్కువ గంటలు పనిచేసి, ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఉంటారు. కానీ ఈ విధానం నేటి కాలానికి సరిపోదు. ఎక్కువ గంటలు కాదు, ఎక్కువ నైపుణ్యంతో అధిక ఆదాయం సంపాదించాలని నిపుణులు చెబుతున్నారు. ఆదాయాన్ని పది రెట్లు పెంచుకోవడానికి వారు చెప్పిన చిట్కాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**నైపుణ్యం**

అధిక డిమాండ్ ఉన్న పనులకు సంబంధించిన నైపుణ్యాన్నిపెంచుకోవాలి. కాపీ రైటింగ్, కోడింగ్, యూఐయూఎక్స్ డిజైన్, విక్రయాలు, చెల్లింపుల ప్రకటనలను నేర్చుకోవాలి. వీటి ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు.

**డిజిటల్ ఉత్పత్తులు**

డిజిటల్ ఉత్పత్తులను రూపొందించించి, విక్రయించడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చు. ఆన్ లైన్ కోర్సులు, ఈ-బుక్ లు, టెంప్లేట్లు, టూల్ కిట్లు తదితర ఆన్ లైన్ ఉత్పత్తులను రూపొందించండి. వీటిని ఒక్కసారి తయారు చేస్తే కనీస నిర్వహణతో ఏళ్ల తరబడి ఆదాయం పొందవచ్చు.

## విద్యార్థులు మళ్లీ బడిబాట.. తెరుచుకోనున్న విద్యాసంస్థలు!

**ఏఐ సాధనాలు**

ఆర్టిఫీషియల్ ఇంటిలిటజెన్స్ (ఏఐ)తో అనేక పనులను చాలా సులువుగా చేయవచ్చు. ఇ-మెయిల్స్ పంపడం, పోస్టులను షెడ్యూల్ చేయడం, విజువల్స్ డిజైన్ .. ఇలా వివిధ పనులు చేసుకోవచ్చు. వీటి ద్వారా ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుంది. చాట్ జీపీటీ, జేపియర్, నోషన్ ఏఐ, కన్వెర్ట్ కిట్ తదితర ఏఐ సాధనాలపై అవగాహన పెంచుకోవాలి.

**ఆదాయ మార్గాలు**

ఆదాయం సంపాదించడానికి వివిధ మార్గాలను అన్వేషించాలి. మార్కెటింగ్, స్టాక్ ఫొటో గ్రఫీ, కంటెంట్ మానిటైజ్ (యూట్యూబ్, మీడియా) తదితర అనేక మార్గాలు ఉంటాయి.

**వ్యక్తిగత ఆదాయం**

వివిధ అంశాలపై మీకున్న అవగాహనను ఇతరులకు తెలియజేస్తూ కూడా

## రక్తపాతం చిందిస్తున్న ‘డీసీ’ ట్రైలర్.. హీరోగా లోకేశ్ కనగరాజ్ సంచలనం!

**ఇక తాజాగా రిలీజైన ట్రైలర్ ప్రారంభంలోనే కారులో ఒక మహిళ భయంతో కేకలు వేస్తున్న సన్నివేశం కనిపిస్తుంది.**




స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ హీరోగా నటిస్తున్న డీసీ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో క్రైమ్ యాక్షన్ సన్నివేశాలతో పాటు హీరోయిన్ వామికా గబ్బితో ఉన్న ఎమోషనల్ లవ్ డ్రామా కూడా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాకు అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. రాకీ, సాణికాయిదం, కెప్టెన్ మిల్లర్ వంటి సినిమాలను తెరకెక్కించిన అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఇందులో లోకేశ్ కనగరాజ్ దేవదాస్ అనే పాత్రలో నటిస్తుండగా, వామికా గబ్బి చంద్ర పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, తాజాగా వచ్చిన ట్రైలర్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. మానగరం సినిమాతో డైరెక్టర్ గా పరిచయమైన లోకేశ్ కనగరాజ్, ఆ తర్వాత ఖైదీ సినిమాతో మరో స్థాయికి చేరుకున్నారు. అనంతరం రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు తెరకెక్కించారు. చివరిగా ఆయన తెరకెక్కించిన కూలీ సినిమా మంచి వసూళ్లు సాధించింది. ప్రస్తుతం డైరెక్టర్ గా ఉన్న లోకేశ్ కనగరాజ్, డీసీ సినిమాతో హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాలో సంజనా, వామికా గబ్బి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వేలంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ అయిన గ్లింప్స్ వీడియోలో సంజనా సిగరెట్ తాగుతూ కనిపించగా, ఆ గదిలోకి లోకేశ్ ప్రవేశించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక తాజాగా రిలీజైన ట్రైలర్ ప్రారంభంలోనే కారులో ఒక మహిళ భయంతో కేకలు వేస్తున్న సన్నివేశం కనిపిస్తుంది. ఆ తర్వాత తుపాకీ కాల్పులు, రక్తపాతం, హై వోల్టేజ్ యాక్షన్ సీన్స్‌తో ట్రైలర్ మొత్తం ఉత్కంఠభరితంగా సాగుతుంది. డబ్బు కోసం తమ కుమార్తెను తప్పుదారి పట్టించే తల్లిదండ్రుల నుంచి చంద్రను దేవదాస్ ఎలా కాపాడతాడు అన్నదే సినిమా కథ అని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ట్రైలర్ చివర్లో ఆమె పేరు చంద్రరా.. అంటూ ఓ బూతు పదంతో ముగుస్తుంది. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్‌లో అనేక అసభ్య పదాలు ఉండటంతో వాటిని మ్యూట్ చేశారు. దీంతో సినిమా మొత్తం ఎలా ఉండబోతుందనే ఆసక్తితో పాటు కొంత సందేహం కూడా అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే.



## ఇండిపెండెంట్ మ్యూజిక్‌తోనూ అద్భుతాలు!

డిజిటల్ యుగంలో సక్సెస్ అవ్వడానికి ట్యాలెంట్ ఉంటే చాలు. ప్రత్యేకించి సినిమా రంగంలో స్థిరపడాలనుకునే వారికి డిజిటల్ మాధ్యమాలు ఎంతగా దోహదపడుతున్నాయో తెలిసిందే. ట్యాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటూ ఒక్క వీడియో చేస్తే చాలు.. అది చేరాల్సిన వారికి చేరితో ప్రతిభను గుర్తించి పిలిచి మరీ అవకాశాలిస్తోన్న రోజులివి.ఈ మధ్య కాలంలో అలా వెలుగులోకి వస్తోన్న సంగీత దర్శకుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది.ఇండిపెండెంట్ సంగీతానికి కూడా శ్రోతలను విశేషంగా అలరిస్తోంది. ఈ క్రమంలోనే ప్రముఖ సింగర్ కయాన్ ఇండిపెండెంట్ మ్యూజిక్ సాధిస్తున్న పురోగతి గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. స్వతంత్ర సంగీతానికి అద్భుతమైన సమయం నడుస్తోంది. గతంలో సినిమా పాటల నీడలో మరుగున పడిపోయిన ఇండిపెండెంట్ కళాకారులకు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోందన్నారు. -మనం ఇప్పుడు గ్లోబల్ విలేజ్‌లో ఉన్నాం. ఇక్కడ సంగీతం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఆధునిక బీట్స్ కలయికతో వస్తోన్న పాటలను ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్నారన్నారు. ఇలాంటి ఎలాంటి ఒత్తిళ్లకు గురవుతున్నారో కూడా వివరించారు. సింగర్‌ను , మ్యూజీషియన్‌ను ఒకే రకమైన శైలికి పరిమితం చేయాలని చూడటం సరికాదని కయాన్ అన్నారు. తాను ఎప్పుడూ రొటీన్ పద్ధతులకు లొంగిపోలేదని నచ్చిన రీతిలో ప్రయోగాలు చేయడానికే ఇష్టపడతానన్నారు. ఇండస్ట్రీ నిర్దేశించిన ఫార్ములాలను పాటించకుండా స్వంత అభిరుచితో చేసినప్పుడే నిజమైన కళాఖండాలు పుడతాయని కయాన్ వెల్లడించారు. కానీ స్వతంత్ర కళాకారిణిగా నిలదొక్కుకోవడం అంత సులభం కాదన్నారు. ఇందులో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని అధిగమించి ప్రయాణం చేయాల్సి ఉంటుందుందన్నారు. కానీ ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే? ఎలాంటి ఒత్తిళ్లు అయినా దాటొచ్చు. ఒక్క సక్సెస్ ఎంతో ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. మారుతోన్న కాలానికి అనుగుణంగా శ్రోతలు కూడా కొత్త తరహా సంగీతాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది తమలాంటి యంగ్ మ్యుజీషియన్లకు పెద్ద వరమని కయాన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతీయ స్వతంత్ర సంగీతం ప్రత్యేక అస్తిత్వాన్ని సృష్టించుకుందని అంతా నమ్ముతున్నారు. వెస్ట్రన్ మ్యూజిక్‌ను అనుకరణతో పాటు, మూలాలను మర్చిపోకుండా కొత్తదనాన్ని జోడించడం వల్లే ఇండి మ్యూజిక్ ముమెంటం అందుకుందన్నారు. భవిష్యత్తులో ఈ రంగం మరిన్ని శిఖరాలను అధిరోహిస్తుందని సినిమా సంగీతంతో సమానంగా ఇండి మ్యూజిక్ కూడా రాజ్యమేలుతుందని అభిప్రాయపడ్డారు. కయాన్ వంటి కళాకారులు చూపిస్తున్న తెగువ , సృజనాత్మకత భారతీయ సంగీత రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. పరిమితులకు తలొగ్గకుండా? తన గాత్రాన్ని ప్రపంచానికి వినిపిస్తున్న ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఇండిపెండెంట్ మ్యూజిక్ ట్రెండ్ మాత్రమే కాదు. అది భారతీయ కళాకారుల స్వేచ్ఛకు చిహ్నమని కయాన్ మాటలు నిరూపిస్తున్నాయి


## ఆంధ్రావాలా ఫ్లాపవుతుందని ముందే తెలుసు!




టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై తీవ్ర నిరాశ మిగిల్చిన సినిమాల లిస్ట్ లో జూనియర్ ఎన్టీఆర్- పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన ఆంధ్రావాలా పేరు ఇప్పటికీ ప్రత్యేకంగా వినిపిస్తుంటుంది. 2004లో రిలీజైన ఈ సినిమా అప్పట్లో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత హైప్ క్రియేట్ చేసిన ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. ఫస్ట్ లుక్ నుంచి ఆడియో వరకు అభిమానుల్లో విపరీతమైన అంచనాలు పెంచిన ఈ సినిమా, రిలీజ్ తర్వాత మాత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా మారింది. తాజాగా ఈ సినిమాపై ప్రముఖ ఎడిటర్ కె. మార్తాండ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఆంధ్రావాలా సినిమా అండర్ ప్రొడక్షన్‌లో ఉన్నప్పుడే ఇది వర్కౌట్ కావడం కష్టమని చెప్పాను. కానీ దర్శకుడు పూరీ జగన్నాథ్ వినలేదని చెప్పడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఒక పెద్ద సినిమా నిర్మాణ దశలోనే దాని ఫలితం గురించి టెక్నీషియన్లు అంచనా వేయడం ఆసక్తికరంగా మారింది. ఇండస్ట్రీలోని చాలామందికి స్క్రిప్ట్ దశలోనే ఒక ప్రాజెక్ట్ భవిష్యత్తుపై క్లారిటీ వచ్చేస్తుందని ఇండస్ట్రీలో తరచూ అంటూంటారు. కొంతమంది డైరెక్టర్లు లేదా నిర్మాతలు కథ వర్కౌట్ కాదని భావిస్తే అక్కడికక్కడే ప్రాజెక్ట్‌ను నిలిపివేస్తారు. మరికొందరు షూటింగ్ ప్రారంభమైన తర్వాత లోపాలు గుర్తించి స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తూ సినిమాను కొత్త దారిలో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో పరిస్థితులు పూర్తిగా చేతిలో లేకపోవడంతో టెక్నీషియన్లు కేవలం తమ బాధ్యతను పూర్తి చేయడానికే పరిమితమవుతారు. మార్తాండ్ వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆయన చెప్పినట్లుగా, సినిమా ఫలితం ఎలా ఉండబోతుందో తెలిసినా, ఒకసారి భారీ స్థాయిలో షూటింగ్ ప్రారంభమైన తర్వాత దాన్ని ఆపడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడుతుంటుంది. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాల్లో అభిమానుల అంచనాలు, నిర్మాతల పెట్టుబడులు, మార్కెట్ ఒత్తిళ్లు కలిసి నిర్ణయాలను ప్రభావితం చేస్తుంటాయి. ఆంధ్రావాలా విషయంలో కూడా అలాంటి పరిస్థితులే నెలకొన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఆంధ్రావాలా ఫ్లాప్‌తో ముగిసిపోయిన ఈ కాంబినేషన్, దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ కలసి టెంపర్ రూపంలో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా జూనియర్ ఎన్టీఆర్ కెరీర్‌కు కీలక మలుపుగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్, డైలాగ్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న టెంపర్ భారీ విజయాన్ని అందుకుని ఎన్టీఆర్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ముఖ్యంగా ఆ సినిమా తర్వాత ఎన్టీఆర్ ఎంపిక చేసుకున్న కథలు, నటనలో వచ్చిన మార్పు ఆయన కెరీర్‌ను కొత్త దిశగా మలిచాయి. ప్రస్తుతం మార్తాండ్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతుండగా, అభిమానులు మాత్రం ఆంధ్రావాలా నుంచి టెంపర్ వరకు ఈ కాంబో ప్రయాణాన్ని మరోసారి గుర్తుచేసుకుంటున్నారు.

## చిరంజీవి, విజయ్.. సర్ ప్రైజ్ కాల్!

**ఒక సీనియర్ నటుడిగా చిరంజీవి ఇచ్చిన ఈ బూస్టప్ విజయ్ కి ఎంతో బలాన్నిచ్చేదే. ప్రజా సేవలో విజయ్ మరిన్ని సక్సెస్ లు చూడాలని చిరంజీవి తన మనసులోని మాటను చెప్పారు.**





తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న విజయ్ కి ఇప్పుడు దేశవ్యాప్తంగా సినీ స్టార్స్ నుంచి విషెస్ అందుతున్నాయి. ఊహించని విధంగా మొదటి అడుగులోనే సీఎం సీటు ఎక్కి అందరిని ఆశ్చర్య పరిచిన విజయ్ తన స్టార్ హోదా ఏమిటో మరోసారి నిరూపించారు. ఇక మెగాస్టార్ చిరంజీవి ఫోన్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఒకరు వెండితెరను దశాబ్దాలుగా ఏలుతున్న హీరో అయితే, మరొకరు సినిమాల్లో సత్తా చాటి ఇప్పుడు ప్రజా క్షేత్రంలో కీలక పదవిలో ఉన్న నేత. 00:04 / 02:25 వీరిద్దరి మధ్య సాగిన ఈ ఆత్మీయ సంభాషణ తెలుగు, తమిళ రాష్ట్రాల్లో అందరి దృష్టిని ఆకర్షించింది. విజయ్ సీఎం అయ్యాక జరిగిన ఈ తొలి అధికారిక పలకరింపుకు ఇప్పుడు చాలా ప్రాధాన్యత పెరిగింది. విజయ్ పాలన దివంగత నేత ఎం.జి.ఆర్ గారి లాగే సాగాలని చిరంజీవి కోరుకున్నారు. ప్రజల కోసం చేసే పనుల్లో విజయ్ తనదైన ముద్ర వేయాలని, అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని చిరంజీవి అభినందించారు. ఒక సీనియర్ నటుడిగా చిరంజీవి ఇచ్చిన ఈ బూస్టప్ విజయ్ కి ఎంతో బలాన్నిచ్చేదే. ప్రజా సేవలో విజయ్ మరిన్ని సక్సెస్ లు చూడాలని చిరంజీవి తన మనసులోని మాటను చెప్పారు. అలాగే విజయ్ కూడా మెగాస్టార్ మీద తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇటీవల చిరంజీవి నటించిన “మన శంకర వర ప్రసాద్ గారు” సినిమా చూశానని విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. చిరంజీవిని మళ్ళీ ఆ రేంజ్ పాత్రలో స్క్రీన్ మీద చూడటం చాలా హ్యాపీగా అనిపించిందని విజయ్ అనడం విశేషం. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా తన తోటి నటుడి సినిమా గురించి స్పెషల్ గా ప్రస్తావించడం ఫ్యాన్స్ ని ఖుషీ చేస్తోంది. శుభాకాంక్షలతోనే ఆగిపోకుండా చిరంజీవి నెక్స్ట్ ప్రాజెక్టుల గురించి కూడా విజయ్ ఆరా తీశారు. ప్రస్తుతం కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మెగాస్టార్ చేస్తున్న కొత్త సినిమాకు విజయ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇండస్ట్రీ వ్యక్తులు ఇలాంటి ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు ఇలాంటి పలకరింపులు సినిమా రంగానికి ఒక రకమైన భరోసానిస్తాయి. భాష ఏదైనా ఒకరి సినిమాలను ఒకరు గౌరవించుకోవడం ఒక మంచి పద్ధతి. నిజానికి గతంలో కూడా తెలుగు, తమిళ స్టార్ల మధ్య మంచి బాండింగ్ ఉండేది. ఇప్పుడు విజయ్ ముఖ్యమంత్రి కావడంతో ఆ బంధం ఇంకా స్ట్రాంగ్ అయ్యే ఛాన్స్ ఉంది. చిరంజీవి, విజయ్ మధ్య జరిగిన ఈ టాక్ కేవలం రాజకీయ సంబంధం మాత్రమే కాదు, ఒక మంచి ఫ్రెండ్ షిప్ అని ఫ్యాన్స్ చెబుతున్నారు. పాలిటిక్స్ వేరైనా కళాకారులుగా వారి మధ్య ఉన్న రెస్పెక్ట్ ఏమాత్రం తగ్గలేదని ఈ ఇన్సిడెంట్ తో అర్థమవుతోంది. ఇక ఇద్దరు సూపర్ స్టార్లు ఇలా మాట్లాడుకోవడం అటు మెగా ఫ్యాన్స్ కి, ఇటు విజయ్ ఫ్యాన్స్ కి పెద్ద కిక్ ఇచ్చింది. రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు ఇంకా మెరుగుపడటానికి ఇలాంటి ఆత్మీయ కలయికలు బాగా హెల్ప్ అవుతాయి. మెగాస్టార్, సీఎం విజయ్ ల ఈ స్నేహం ముందు ముందు ఇంకెన్ని ఇంట్రెస్టింగ్ పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

# బ్లాక్ గౌనులో సెగలు పుట్టిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్!

**అందులో భాగంగానే ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఈ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.**









ఇటీవల కాలంలో సెలబ్రిటీలు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తన గ్లామర్ తో ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఒకవైపు సినిమా షూటింగ్ లతో ఎంత బిజీగా ఉన్నా మరొకవైపు ఫాలోవర్స్ ను, నెటిజన్స్ ను ఆకట్టుకోవడానికి ఇలా వరుస ఫోటోషూట్స్ తో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రముఖ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన అందాల సోయగాలతో మరొకసారి అభిమానులను మైమరిపింపచేసే ప్రయత్నం చేసింది . బ్లాక్ అవుట్ ఫిట్ లో గ్లామర్ లుక్ ఇచ్చిన రకుల్.. అందులో భాగంగానే ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఈ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఫ్యాషన్ ప్రియులకు ఇదొక ట్రెండీ ఔట్ఫిట్ గా నిలిచింది .అందులో గ్లామర్ వలకబోస్తూ షేర్ చేసిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ బ్లాక్ గౌన్ కి పర్ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా సిల్వర్ కలర్ బ్లాక్ కలర్ ఫింగర్ రింగ్స్ ధరించిన ఈమె.. జుట్టును వేవ్ లా వదిలేసి సింపుల్ స్మైల్ తో ఆకట్టుకుంది. ముఖ్యంగా ఫ్రాక్ కి తగ్గట్టుగా బోసి నెక్ తో.. నడుము మీద చెయ్యి పెట్టి వయ్యారంగా ఫోటోలకు ఫోజులిచ్చింది. మరికొన్ని ఫోటోలలో సెల్ఫీతో ఆకట్టుకుంది. మొత్తానికి రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేసిన ఈ ఫోటో గ్యాలరీ అభిమానులను ఆకట్టుకుంటుంది. థియేటర్లోకి వచ్చిన రకుల్ కొత్త సినిమా.. ఇదిలా ఉండగా ప్రస్తుతం బాలీవుడ్ లోనే వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా నటించిన చిత్రం పతి పత్నీ ఔర్ దో.. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరో ఆయుష్మాన్ ఖురానా, రకుల్ ప్రీత్ సింగ్ , సారా అలీ ఖాన్, వామికా గబ్బిలు హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాను టీ సిరీస్, బి.ఆర్ స్టూడియోస్ బ్యానర్లపై రేణు రవి చోప్రా, కృష్ణన్ కుమార్ , భూషణ్ కుమార్ లు సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా వచ్చిన ఈ సినిమాకి ముదసర్ అజీజ్ దర్శకత్వం వహించారు. విజయ రాజ్, దుర్గేష్ కుమార్, దీపిక అమీన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ సినిమా. ఈ సినిమా మొదటి షో తోనే మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకోవడం విశేషం. రకుల్ ప్రీత్ సింగ్ కెరియర్.. కెరటం సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన రకుల్ ప్రీత్ సింగ్.. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తర్వాత పలువురు టాలీవుడ్ స్టార్ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ అందుకున్న ఈ బ్యూటీ.. కెరియర్ పీక్స్ లో ఉండగానే మన్మధుడు వంటి చిత్రంలో నటించి విమర్శలు ఎదుర్కొంది. ఇక ఇప్పుడు బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ బిజీగా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ అక్కడ వరుస విజయాలను అందుకుంటూ తన అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా తన నటనకు తగ్గట్టుగా అవార్డుల రూపంలో గౌరవాలను కూడా అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ.